క్లుప్తంగా

మాస్టర్ పట్టా అందుకున్న మాజీ సర్పంచ్ కుమారుడు


పట్టాతో నేతాజి

తొగుట(దుబ్బాక): మండలంలోని బంజేరుపల్లి మాజీ సర్పంచ్ మంతూరి శ్రీలతసత్యనారాయణల కుమారుడు నేతాజి అమెరికాలోని గవర్నర్స్ స్టేట్ యూనివర్సిటీలో హెల్త్ ఇన్ఫర్మేటిక్‌లో పట్టా అందుకున్నాడు. ప్రాథమిక విద్య బంజేరుపల్లిలో చదువుకున్నాడు. అనంతరం సిద్దిపేట, హైదరాబాద్, బెంగుళూరు పట్టణాల్లో చదువుకున్నాడు. తర్వాత ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లాడు. మధ్య తరగతి కుటుంబంలో జన్మించి నేతాజి పట్టుదలతో చదివి అమెరికా యూనివర్సిటీలో పట్టా అందుకొని గ్రామీణ యువతకు ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు మాట్లాడుతూ.. అమెరికాలో ఉన్నత చదువులు చదివి మాస్టర్స్ పట్టా తీసుకోవడం ఆనందంగా ఉందన్నారు.

మల్కాపూర్‌లో స్వచ్ఛభారత్


చెత్తను తొలగిస్తున్న గ్రామస్తులు

తూప్రాన్: మండలంలోని మల్కాపూర్ గ్రామంలోని నాలుగో వార్డులో ఆదివారం 359వ వారం స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డులో పిచ్చి మొక్కలను తొలగించి రోడ్లను శుభ్రం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మన్నే మహాదేవి, వార్డుసభ్యులు మన్నే మమత, అబ్జల్ బీ, గ్రామ పంచాయతీ సిబ్బంది మేకిన్ యువత, గ్రామ పెద్దలతో పాటు పాఠశాలలకు సెలవులు కావడంతో విద్యార్థులు సైతం పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం


విద్యార్థులను సన్మానిస్తున్న నాయకులు

చిన్నకోడూరు(సిద్దిపేట): పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మండలంలో 10జీపీఏ సాధించిన విద్యార్థులను బీఆర్ఎస్ సోషల్ మీడియా మండల కన్వీనర్ రాజలింగం ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించి అభినందించారు. విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు అందజేశారు. ఉత్తమ ఫలితాలకు కృషి చేసిన ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో గ్రామాల సర్పంచ్‌లు, బీఆర్ఎస్వీ మండల అధ్యక్షుడు రాజు, నాయకులు శ్రావణ్‌కుమార్, రాజశేఖర్‌రెడ్డి, భానుచందర్ పాల్గొన్నారు.

పరామర్శ


పరామర్శిస్తున్న ఎంపీ ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక: దౌల్తాబాద్ మండలం సూరంపల్లి గ్రామానికి చెందిన సోమన్నగారి యాదగిరి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి అండగా ఉంటామని హామీనిచ్చారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, సర్పంచ్ నర్సింలు, నాయకులు చిందం రాజ్‌కుమార్, సత్యం తదితరులున్నారు.

నిరుపేద యువతి వివాహానికి చేయూత

దుబ్బాక: తల్లిదండ్రులు లేని యువతి వివాహానికి దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు అండగా నిలిచారు. రాయపోల్ మండలం వడ్డేపల్లి గ్రామానికి చెందిన నందిని వివాహానికి ఎమ్మెల్యే రఘునందన్‌రావు రూ.25వేలు ఆర్థికసాయం అందించి మానవత్వం చాటుకున్నారు. ఆదివారం నందిని వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. యువతికి అన్ని విధాల అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాజ్‌గౌడ్, రామగౌడ్, మహేశ్‌గౌడ్, ఎల్లం, చింటు తదితరులున్నారు.

సీఎం కప్‌కు ఏర్పాట్లు

కౌడిపల్లి(నర్సాపూర్): సీఎం కప్ క్రీడాపోటీలకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సోమవారం నుంచి మూడురోజుల పాటు జరగనున్న క్రీడలకు గాను మండల కేంద్రమైన కౌడిపల్లి ఉన్నత పాఠశాలలోని గ్రౌండ్‌ను ట్రాక్టర్ డోజర్‌తో చదును చేశారు. ఈనెల 15, 16, 17వ తేదీల్లో సీఎం కప్ క్రీడల సందర్భంగా వాలీబాల్, కబడీ, ఖోఖో, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్న ఎంపీడీఓ శ్రీనివాస్, ఇన్‌చార్జి ఎంపీఓ వెంకటేశం తెలిపారు. క్రీడాకారులకు సౌకర్యంగా ఉండేందుకు గ్రౌండ్ సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు.

బల్దియా ముందస్తు కసరత్తు

వరద నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చర్యలు ◆ పూడికతీత పనులపై ఆరా


మురికి కాల్వలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ సంపత్, అధికారులు

సిద్దిపేటజోన్: రాబోయే వర్షాకాలంలో వరద కాల్వలు మట్టితో పూడుకొని వరద నీటి ప్రవాహానికి అడ్డంకులు సృష్టించకుండా బల్దియా ముందస్తు కసరత్తు చేస్తోంది. ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు ఆదేశాల మేరకు మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, మున్సిపల్ కమిషనర్ సంపత్ ఆధ్వర్యంలో అధికారులు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ప్రతి ఏటా వర్షాకాలంలో వరద కాల్వలు మట్టితో నిండి వర్షపు నీటితో ముంపు ప్రాంతాల్లో, పట్టణ విధుల్లో నీరు నిల్వ ఉండి ప్రజలకు అసౌకర్యంగా మారుతోంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని మున్సిపల్ అధికారులు ముందస్తు చర్యలుగా వరద కాల్వల్లో పూడికతీత పనులను చేపట్టాలని నిర్ణయించారు. పట్టణంలో కురిసిన వర్షం నీరు వరద కా ల్వల ద్వారా నేరుగా ఎర్ర చెరువు, నర్సాపూర్ చెరువుల్లోకి వెళ్లేలా వరద కాల్వలు శుభ్రం చేయనున్నారు. కాల్వల్లో పేరుకుపోయిన మట్టి, చెట్లు, చెత్తాచెదారం తొలగించి పూర్తిస్థాయిలో కెనాల్ పునరుద్ధరణ ప్రక్రియ జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగంగానే ఆదివారం మున్సిపల్ కమిషనర్ సంపత్, మున్సిపల్ ఈఈ ప్రతాప్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సతీశ్, అధికారులు, సిబ్బంది పట్టణంలో సమస్యాత్మక ప్రాంతాలను లోతట్టు ప్రాంతాలను, వరద కాల్వలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముఖ్యంగా కోమటిచెరువు నుంచి నర్సాపూర్ వరకు ఉన్న మెయిన్ కెనాల్‌ను శుభ్రపరిచే పనులు, గురప్రు డెక్కను తొలగించి పారిశుధ్య పనులను వేగవంతం చేయాలని నిర్ణయించా రు. అదేవిధంగా పట్టణంలోని మురికి కాల్వల్లో చెత్తాచెదారం, మట్టి తొలగింపు, ప్రధాన వరద కాల్వల్లో పూడికతీత పనులను చేపట్టాలని సంకల్పించారు.

అమ్మవారి దయతో సంతోషంగా ఉండాలి


అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి

మద్దూరు(హుస్నాబాద్): అమ్మవారి దయతో ప్రజలందరూ సంతోషంగా ఉండాలని, ప్రకృతి విపత్తులు రాకుండా ఉండాలని జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. మద్దూరు మండల పరిధిలోని రేబర్తి గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠ, దుర్గమ్మ పండగలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో కరువు కాటకాలతో అల్లాడిన ప్రాంతం నేడు సుభిక్షంగా ఉందన్నారు. సాగునీటి కటకట నేడు లేదన్నారు. కొద్దిరోజులుగా కురిసిన వడగండ్ల వర్షంతో రైతులు ఇబ్బందులు పడ్డారని, మనోధైర్యం కోల్పోకుండా ధైర్యంగా ఉండాలని రైతులకు భరోసానిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ సుమలతమల్లేశం, మద్దూరు, దూళ్మిట్ట మండలాల బీఆర్ఎస్ అధ్యక్షులు మేక సంతోష్‌కుమార్, యాదగిరి, పీఏసీఎస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, సర్పంచ్‌లు సవితచంద్రశేఖర్, స్రవంతిపరశురాములు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బొడ్రాయి ప్రతిష్ఠోత్సవాలకు సహకరించాలి


బొడ్రాయి ఏర్పాటుపై మాట్లాడుతున్న గురువు, తదితరులు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని గౌరవెల్లి గ్రామంలో జరగబోయే బొడ్రాయి ప్రతిష్ఠ ఉత్సవాలకు గ్రామస్తులంతా సహకరించాలని వైస్ ఎంపీపీ మజ్జిగ మొగిళి, సర్పంచ్ బైరగోని పుష్పలీల అన్నారు. ఆదివారం గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో బొడ్రాయి పండగకు సంబంధించిన గురువు మాట్లాడుతూ.. మే 24న బొడ్రాయి ప్రతిష్ఠకు భూమిపూజ, మే 31 దేశగురువు ద్వారా బొడ్రాయి గ్రామ ప్రవేశం ఉంటుందన్నారు. ఆ తర్వాత నాభిశిలా యంత్ర ప్రతిష్ఠ, జూన్ 5న గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠ ఉత్సవాలు ప్రారంభమై 8న ముగుస్తాయని తెలిపారు. అందరూ కలిసికట్టుగా పండగలు జరుపుకోవాలని కోరారు.

ప్రైవేట్ నర్సరీలతో అధిక లాభాలు

బెజ్జంకి(సిద్దిపేట): ప్రైవేట్ నర్సరీలతో నిర్వాహకులకు అధిక లాభాలు వస్తాయని మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పేర్కొన్నారు. బెజ్జంకిలో ఆదివారం ప్రైవేట్ నర్సరీని ఆయన ప్రారంభించారు. పెండ్ల మొక్కలు మంచి లాభాలిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ లింగాల నిర్మల, ఏఎంసీ చైర్మన్ కచ్చు రాజయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి, లక్ష్మన్, శ్రీనివాస్‌గుప్తా, తి రుపతి, సంతోష్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం


సిబ్బందిని సన్మానిస్తున్న కౌన్సిలర్ శోభారాణి

సిద్దిపేటజోన్: పట్టణంలోని 42వ వార్డులో కంటి వెలుగు శిబిరాన్ని దిగ్విజయంగా నిర్వహించి లక్ష్యం సాధనకు సహకరించిన అధికారులు, సిబ్బందికి మున్సిపల్ కౌన్సిలర్ శోభారాణి ఆదివారం సన్మానించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వార్డ్ నాయకులు రఘురాం తదితరులు పాల్గొన్నారు.

మురికి కాల్వలు నిర్మించరూ..


ఓపెన్ ప్లాట్లలోకి చేరుతున్న మురుగు

గజ్వేల్‌రూరల్: మురికి కాల్వలు నిర్మించి సమస్యను పరిష్కరించాలని మున్సిపాలిటీ పరిధిలోని పలువురు ప్రజలు పేర్కొన్నారు. పట్టణంలోని సాయి జీడీఆర్ స్కూల్ పక్కనగల ఓపెన్ ప్లాట్లలోకి మురు గు చేరి దుర్గంధం వెదజల్లుతుందన్నారు. ఈ ప్రాంతంలో మురికి కాల్వ నిర్మించాలని పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి పరిష్కారం లేదని, ఇప్పటికైనా స్పందించి పాఠశాల పునఃప్రారంభమయ్యేలోగా మురికి కా ల్వ నిర్మాణానికి చొరవ చూపాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

బాల కార్మికులతో పని చేయించొద్దు


సమస్యలు అడిగి తెలుసుకుంటున్న సీఐ కిరణ్

హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణ, పరిసర ప్రాంతాల్లోని ఇటుక బట్టీలలో బాల కార్మికులతో పని చేయించొద్దని సీఐ కిరణ్ సూచించారు. ఎస్సై మహేశ్, డీసీపీఓ అధికారులతో కలిసి ఆయన హుస్నాబాద్ శివారులో ఉన్న ఇటుక బట్టీల్లో పని చేస్తున్న కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ కిరణ్ మాట్లాడుతూ.. ఎవరైన కొత్త వ్యక్తులు వస్తే సమాచారం అందించాలని సూచించారు. పరిచయం లేని వ్యక్తులతో పిల్లలను బయటకు పంపించొద్దన్నారు. పిల్లలను హుస్నాబాద్ పట్టణ, పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి విద్యను అభ్యసించే విధంగా కృషి చేయాలన్నారు. మహిళలు, పిల్లలకు రక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. బాల కార్మికులతో పని చేయించొద్దని సంబంధిత ఇటుక బట్టీల యాజమానులకు సూచించారు.


ఇబ్రహీంనగర్-గోనెపల్లి గ్రామాల మధ్య నిర్మిస్తున్న వంతెన

దశాబ్దాల కల నెరవేరింది..

వంతెనల నిర్మాణంతో తొలగిన ఇబ్బందులు

చిన్నకోడూరు(సిద్దిపేట): వర్షాకాలం వచ్చిందంటే రవాణా వ్యవస్థ ఆగిపోయేది. చిన్నకోడూరు నుంచి చౌడారం, ఇబ్రహీంనగర్ నుంచి గోనెపల్లి గ్రామాల మధ్య వంతెన లేకపోవడంతో ప్రతిఏటా వర్షాలు పడి వాగులు పారడంతో రాకపోకలు నిలిచిపోయేవి. రైతులు పండించిన పంటలను తీసుకెళ్లేందుకు ఇబ్బంది పడేవారు. మంత్రి హరీశ్‌రావు చొరవతో వంతెనల నిర్మాణానికి రూ.7.15కోట్లు మంజూరు చేశారు. చిన్నకోడూరు–చౌడారం గ్రామాల మధ్య వంతెన పూర్తికాగా, ఇబ్రహీంనగర్–గోనెపల్లి మధ్య వంతెన చివరదశకు చేరుకుంది. త్వరలోనే అందుబాటులోకి రానుంది. శాశ్వత పరిష్కారానికి వంతెనలు నిర్మించడంతో దశాబ్దాల కల నెరవేరిందని రైతులు, ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి

భారీగా తరలివచ్చిన భక్తులు, స్వాములు ◆ శ్రీరామ నామంతో మార్మోగిన ఆలయాలు


ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): హోమం నిర్వహిస్తున్న స్వాములు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): హనుమాన్ జయంతి ఉత్సవాలను జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలో అన్ని ఆలయాల్లోని హనుమాన్ మూలవిరాట్‌లను పూలు, పండ్లతో సుందరంగా అలంకరించారు. ఉదయం నుంచే భక్తులు ప్రత్యేక పూజలు, భజనలు, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. స్వాములు హనుమాన్ మాలధారణ విరమణ చేశారు. దీంతో ఆలయాలు భక్తులు, హనుమాన్ స్వాములతో కిక్కిరిసిపోయాయి. ఆలయాల పరిసరాల ప్రాంతాలు శ్రీరామనామంతో మార్మోగాయి.

హుస్నాబాద్: పట్టణంలోని శివాజీనగర్‌లో గల దాసాంజనేయస్వామి ఆలయం, ఎల్లంబజార్‌లోని అభయ వీరాంజనేయస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూలవిరాట్‌లకు అభిషేకాలు, హోమాలు, పూర్ణాహుతి, కలశ, నవగ్రహ మండపారాధన, హనుమాన్ చాలీసా పారాయణం, గీతా పారాయణం, విష్ణుసహస్ర నామ పారాయణం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

మిరుదొడ్డి(దుబ్బాక): మండల కేంద్రమైన మిరుదొడ్డిలోని హనుమాన్ ఆలయంలో అర్చకుడు విఠాల రాజపున్నయ్యశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, చందనోత్సవంతో పాటు పుష్పార్చన వంటి వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. ఉదయం నుంచే భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలోని కొత్త బస్టాండ్ సమీపంలో గల ఆది ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం హనుమాన్ దీక్షా స్వాముల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఉదయం స్వామికి ఆవు పాలు, పెరుగు, నెయ్యి పంచామృతాలతో అభిషేకం చేసి, చందనం, పూల దండలతో అలంకరణ చేశారు. అనంతరం పూజలు నిర్వహించారు.

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని అంగడిపేట హనుమాన్ ఆలయంలో అర్చకుడు కృష్ణమూర్తిశర్మ ఆధ్వర్యంలో గణపతి పూజ, పుణ్యాహవచనం, ఆంజనేయస్వామి మూలవిరాట్‌కు మాన్యుసూక్త అభిషేకాలు, చందనపూజ, అలంకరణ, మంగళహారతి, మంత్రపుష్పం కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయ స్వామి మూలవిరాట్‌కు భక్తులు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద, అన్నదాన వితరణ చేపట్టారు.


ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మాలవిరమణ చేస్తున్న హనుమాన్ స్వాములు


గజ్వేల్‌లో స్వామివారికి అభిషేకాలు చేస్తున్న భక్తులు


మిరుదొడ్డి(దుబ్బాక): పూజలు చేస్తున్న భక్తులు


హుస్నాబాద్: హోమం నిర్వహిస్తున్న చైర్‌పర్సన్ రజిత వెంకట్ దంపతులు


చేర్యాల(సిద్దిపేట): పూజలు చేస్తున్న హనుమాన్ స్వాములు

బీమా చెక్కు అందజేత


చెక్కు అందజేస్తున్న ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్‌రూరల్: కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్ నిలుస్తుందని ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. బీఆర్ఎస్ సభ్యత్వం కలిగిన మండల పరిధిలోని దాచారం గ్రామానికి చెందిన ఎలేశ్వరం శ్రీనివాస్ ఇటీవల ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందగా ఆదివారం పార్టీ ప్రమాద బీమా నుంచి రూ. 2లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, ఆత్మ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మధు, సర్పంచ్ భాగ్యనర్సింలు, నాయకులు సందీప్‌రెడ్డి, పర్వతాలు, రాంరెడ్డి, వెంకట్, కృష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డి, బాల్‌నర్సయ్య, జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మ బోనాలు


బోనాల ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

వర్గల్(గజ్వేల్): మండలంలోని గౌరారంలో ఆదివారం రాత్రి గౌడ సంఘం ఆధ్వర్యంలో ఎల్లమ్మకు బోనాలు ఘనంగా నిర్వహించారు. శివసత్తుల సిగాలు, డప్పుచప్పుళ్ల మధ్య బోనాల ఊరేగింపు కనుల పండువగా సాగింది. అనంతరం ఆలయానికి చేరుకొని బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో పండగ వాతావరణం అలుముకున్నది.

పుస్తె, మెట్టెలు అందజేత

తొగుట(దుబ్బాక): మండల కేంద్రంలోని నిరుపేద కుటుంబానికి చెందిన దాసరి మల్లేశం రాజమణిల కూతురు రేఖ వివాహానికి మాజీ సర్పంచ్ పబ్బతి శ్రీనివాస్‌రెడ్డి పుస్తె, మెట్టెలతో పాటు కొంత నగదు అందజేశారు. అదేవిధంగా మామిడి మోహన్‌రెడ్డి పుస్తె, మెట్టెలు అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ యాదగిరి, నాయకులు కొంగరి మహేశ్, చంద్రం, బాల్‌నర్సయ్య పాల్గొన్నారు.